# కరణంగారి యుక్తి

శ్రీ పోలాకి
శ్రీనివాసరావు

కరణంగారి హయాంలో అనుక్షణం గ్రామస్థులను ఆరాటం కలిగిస్తూనే ఉంటుంది. ఎప్పుడేమి పోజిరీ వ్రాతలు కల్పిస్తారో, ఎవరెవరి జుట్లకు ముడులు పెట్టాలని తలుస్తారో అని ప్రజలంతా హడలై తల్లడపడుచునే ఉంటారు. కరణంగారి యింట్లో చావటానికి ఘడియలు లెక్కించుకుంటూన్న ముసలి గోవు ఒకటి వుంది. అది చస్తే రెండు మూడు రూపాయలు వెచ్చించి దొడ్డినుండి యీడ్పించి పూడ్పించాలి. కరణంగారు కర్తవ్యం ఆలోచించారు. నౌకరును పిలిచి "ఓరీ పౌరోహితుణ్ణిలా పిలుచుకొనిరా!" అని చెప్పారు. నౌకరు పౌరోహితునివద్దకు పోయి కరణంగారు పిలిచారని తెలియజేశాడు. కరణమేమి నెత్తిని వేస్తాడోనని తహతహలాడుతూ కరణంగారిని దర్శించాడు పౌరోహితుడు.

"అయ్యా! నేను గోదానం చేస్తున్నాను. దాన్ని మీరు పొందాలి!" అని ఆజ్ఞాపించాడు కరణం. పౌరోహితుడు విషయాన్ని అవగతంచేసుకొని బదులు పలుకలేక బద్ధుడయ్యాడు. ప్రాణావసాన దశలోనున్న గోవును ఒక రూపాయి దక్షిణతో దానాన్ని ప్రతిగ్రహించాడు. కరణంగారి నౌకరును సహాయం తీసుకొని ముప్పతిప్పలుపడుతూ గోవును తన యింటికడకు చేర్చాడు పౌరోహితుడు. ఆ క్షణాన్నే పౌరోహితుని పశువులదొడ్లో కండ్లు మూసిందా దానం పొందిన గోవు. తిండికి లేక పస్తులు పడుతూన్న ఆ పేద పౌరోహితుడు విచారిస్తూ ఇంటిలోనున్న పాత్ర సామానులను కుదువబెట్టి రెండు రూపాయలను తెచ్చాడు. దానంలో దక్షిణగా గొన్న రూపాయితో కలిపి మూడు రూపాయలను కటికవాండ్రకిచ్చి చచ్చిన యావును దొడ్డినుండి యీడ్పించి పూడ్పించాడు.

కొన్నాళ్ళకు కరణంగారికి కాలం సమీపించింది. కరణంగారు కన్నులు మూశారు. యమభటులు యమధర్మరాజుగారి చెంతకు తీసుకపోయారు కరణాన్ని. యముడు చిత్రగుప్తునిపిలిచి కరణం సంగతులను తెలియజేయమన్నాడు దండనలను విధించటానికి. చిత్రగుప్తుడు పుస్తకముతీసి పుటలు తిరుగవేస్తూ ఏకరువుపెట్టాడు కరణంగారు చేసిన పాపపుంజాలను. కరణం కండ్లెర్ర జేశాడు. "ఏమయ్యా! కరణాన్ని కరణం నమ్మరాదన్న సామెతగా జాతి విరుద్ధం చూపుతూ నా పాపాలనే కొండల్లా కన పరుస్తూన్నావు. నేను పుణ్యాన్ని చేశాను, చిఠాతిరుగవేసి చూడండి చక్కా!" అన్నాడు. చిఠా తిరుగవేసి చిత్రగుప్తుడిలా అన్నాడు. "నీవు ఒక కృత్రిమ

గోదానం దక్క వేరేమి పుణ్యకార్యాలు చేసినట్టు లెక్కలలో కనుపించవు. ఆ గోదానమున్నూ పుణ్యకార్యంగా పరిగణింపబడదు. పాపాలకు తగిన శిక్ష అనుభవింపవలసినదే!'' – తను చేసిన గోదానానికి పుణ్యఫలంగా స్వర్గాన్ని చూట్టానికి అనుమతి నొసంగవలసినదని యమధర్మరాజును ప్రార్థించాడు కరణం. కరణం చేసిన గోలను కనిపెట్టి కనికరంతో సమ్మతించాడు యమధర్మరాజు. భటులను పిలిచి, కరణమునకు స్వర్గముచూపి తీసుకరావలసినదని ఆనతిచ్చాడు.

యమభటులు స్వర్గద్వారము సన్నిధికి తీసుక వెళ్ళారు కరణాన్ని. ''ఇక పోదాం! రా!'' అని పిలిచారు. ''అయ్యో! స్వర్గ ద్వారమును చూపారు కాని స్వర్గాన్ని చూడనివ్వటం లేదే! యమధర్మరాజు గారి ఆజ్ఞ అలా లేదే? స్వర్గాన్ని చూచి రమ్మన్నారు. కనుక నేను స్వర్గములో ప్రవేశించి స్వర్గాన్ని చూడవలసినదే! ఆటంకం చేయటానికి ఎవరు మీరు?'' అని గద్దించాడు కరణం. యమభటులు స్వర్గములో చొరటానికి వీలులేదు గనుక స్వర్గద్వారమువద్దనున్న స్వర్గభటులతో విషయమంతా చెప్పి వారికి కరణాన్ని అప్పగించారు. ''యమభటులకూ మీకూ చాలా వ్యత్యాసముంది. వారు మూర్ఖులు. మీరు చాలా మంచివా''రని స్వర్గభటులను మెప్పించి స్వర్గంలో ప్రవేశించాడు కరణం. కల్పవృక్షంవున్న ప్రదేశానికి వెళ్లాడు. కల్పవృక్షం ఏవికోరితే అవి సమర్పిస్తుంది కనుక ''ఓ కల్పవృక్షమా! బ్రహ్మ విష్ణు మహేశ్వరులను త్రిమూర్తుల సంతకాలతో ఓ కాగితమున్నూ, కలం సిరాబుడ్డీలును నాకు ప్రసాదించాలి!'' అని ప్రార్థించాడు. అట్లే కల్పవృక్షం సమర్పించింది. ఆ కాగితముపై నేదో కల్పించి సంగ్రహించుకొన్నాడు. కాలాతీతమగుచున్నందున స్వర్గభటులు కరణంగారిని పిలుచుకొనిపోయి యమభటుల కప్పగించారు.

కరణంగారు యమభటులతో యమధర్మరాజు సన్నిధికిజేరి మహాధైర్యంగా ''ఓ యమధర్మరాజా! గద్దె దిగుము. నీవు పాతయముడవు నేను క్రొత్త యముడను. ఇదిగో ఈ ఉత్తరువుచూడు''మని కాగితాన్ని చేతికందించాడు. యముడు తెల్లబోయాడు. చేయునదిలేక యమలోకాన్ని కరణంగారి స్వాధీనంచేసి త్రిమూర్తుల సాన్నిధ్యానికిపోయాడు. క్రొత్త యముడగు కరణం గద్దెనధిరోహించాడు. భటులనుపిలిచి చిత్రగుప్తునిరావించాడు. ''నా జాతివైరం నేను చూపుతూన్నా''నని చెప్పి చెరలో వేయించాడు చిత్రగుప్తుణ్ణి. ఇంక యమలోకములో యాతనలు పొందుచున్న పాపాత్ములకు దండనలనుండి విముక్తులుగా

జేసి తండోప తండములుగా స్వర్గానికి పంపుచున్నాడు. పాపులు పరమానందాన్ని పొంది క్రొత్త యమధర్మరాజుగారికి స్తుతి పాఠాలప్పగించారు.

పాత యమధర్మరాజుతో కలిసి త్రిమూర్తులు విచ్చేశారు యమలోకానికి. క్రొత్త యముడు కొంచెమేని భీతిచెందలేదు. త్రిమూర్తులు యిలా నన్నారు. "ఓయీ! నీవు మహా పాపివి. నీ కెవ్వరీ యమలోకమును గట్టినారు, నీవు తాంత్రికునివలె నున్నావే?" కరణం యిలా అన్నాడు "నేను మహాపాపినైతే మీ త్రిమూర్తుల దర్శనం నాకెలా లభిస్తుంది? మీ దర్శన లాభంపొందినవాడు మహాపుణ్యాత్ముడు. కనుక మీ దర్శనం పొందటంవల్ల మహా పుణ్యాన్ని సంపాదించినవాడనయ్యాను. ఈ పుణ్యాన్ని సంపాదించటానికే తంత్రములను పన్నినాను. మంచిఫల మనుభవించటానికి తంత్రములు పన్నితిని గనుక తప్పుగా పరిగణింపక మన్నింపవలసిన"దని ప్రార్థించాడు. త్రిమూర్తులు కరణంగారి యుక్తికి సంతసించి, వానిని స్వర్గానికి పంపివేసి పాతయమునకు తన లోకం తనకు స్వాధీనపరిచారు. పాతయముడు చిత్రగుప్తుని చెరనుండి విడిపించి, స్వర్గానికిపోగా మిగిలిన పాపాత్ములతో పూర్వమువలె పరిపాలన ప్రారంభించాడు.

—o—

ఒక యువకుడు తన భార్యతో విముగా "ఇలాంటి తెలివి తక్కువవాళ్లనుచూచి బొత్తిగా సహించలేను" అన్నాడు.

"అయ్యోపాపం!! మీ అమ్మ మాత్రం చాల సహనంకలిగి యుండియుండాలి" అన్నది భార్య.

పాత్రుడుగారి

# బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 85254.

కుంభకోణము బ్రాంచి :

1. సారంగపాణి కోవిల, తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.